


EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
మంగళవారం
25 జూన్ 2024
పేజీలు: 02



## డ్రగ్స్ వినియోగం.. విష ప్రయోగం లాంటిది
### డిప్యూటీ సీఎం భట్టి

రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ఏ స్థాయిలో అయినా నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో జలవిహార్ వద్ద డ్రగ్స్ నిర్మూలన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. "డ్రగ్స్ వినియోగం విష ప్రయోగం లాంటిది.. ఇది అత్యంత ప్రమాదకరం. కుటుంబ వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తుంది. డ్రగ్స్ సరఫరా చేస్తున్న సంఘ విద్రోహశక్తుల చేతిలో యువత జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయి. కొత్త వ్యక్తులపై ఎల్లప్పుడూ నిఘా ఉంచాలి. తాత్కాలిక సంతోషాలకు విద్యార్థులు బలి కావొద్దు. వారు అడ్డదారులు తొక్కితే కుటుంబంతో పాటు సమాజం మొత్తం బాధపడాల్సి ఉంటుంది" అని భట్టి విక్రమార్క అన్నారు.



## ఆప్ మంత్రి అతిశీ ఆస్పత్రికి తరలింపు

ఢిల్లీ నీటి సంక్షోభంపై నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన ఆప్ మంత్రి అతిశీ ఆరోగ్యం క్షీణిస్తోంది. దీక్ష ఐదో రోజుకు చేరడంతో ఆమెకు షుగర్ లెవెల్స్ పడిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ఆమెను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె 3 కిలోల బరువు తగ్గినట్లు తెలుస్తోంది. కాగా హరియాణా నుంచి ఢిల్లీకి రావాల్సిన నీటి వాటాను వెంటనే విడుదల చేయాలని అతిశీ దీక్ష చేపట్టారు.






# సెమీస్ చేరిన ఆఫ్ఘాన్
## ఆస్ట్రేలియా ఔట్

వెస్టిండీస్‌లోని సెయింట్ విసెంటే స్టేడియంలో రషీద్ ఖాన్ సారథ్యంలో ఆఫ్ఘనిస్థాన్ జట్టు చరిత్ర సృష్టించింది. బంగ్లాదేశ్‌ను ఓడించి ఆఫ్ఘనిస్థాన్ ప్రపంచకప్ చరిత్రలో తొలిసారి సెమీఫైనల్‌కు చేరుకుంది. తొలి సెమీఫైనల్‌లో ఆఫ్ఘనిస్థాన్ జట్టు దక్షిణాఫ్రికాతో తలపడనుంది. ఆఫ్ఘనిస్థాన్ విజయంతో సెమీఫైనల్‌కు చేరుకోవాలన్న ఆస్ట్రేలియా ఆశలకు తెరపడింది. తక్కువ రన్ రేట్ కారణంగా కంగారూ జట్టు ప్రపంచకప్‌నకు దూరమైంది. టాస్ గెలిచిన రషీద్ ఖాన్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. రెహ్మనుల్లా గుర్బాజ్ 43 పరుగుల ఇన్నింగ్స్‌తో ఆఫ్ఘనిస్తాన్ 115 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. బంగ్లాదేశ్ జట్టు 105 పరుగులకే ఆలౌటైంది. నవీన్ ఉల్ హక్ 18వ ఓవర్లో వరుసగా 2 వికెట్లు తీసి జట్టును ఆలౌట్ చేశాడు. 54 పరుగులు చేసిన లిటన్ దాస్ ఒక ఎండ్‌లో నిలవగా, మరో ఎండ్ నుంచి వికెట్లు పడుతూనే ఉన్నాయి. దీంతో బంగ్లా ఏ దశలోనూ కోలుకోలేకపోయింది.

రెండు జట్ల ప్లేయింగ్ XI..
ఆఫ్ఘనిస్థాన్: రషీద్ ఖాన్ (కెప్టెన్), రహ్మనుల్లా గుర్బాజ్ (వికె), ఇబ్రహీం జద్రాన్, గుల్బాదిన్ నైబ్, అజ్మతుల్లా ఒమర్జాయ్, మహ్మద్ నబీ, కరీం జనత్, నంగేలియా ఖరోటే, నూర్ అహ్మద్, నవీన్-ఉల్-హక్, ఫజల్హాక్ ఫరూకీ.
బంగ్లాదేశ్: నజ్ముల్ హొస్సేన్ శాంటో (కెప్టెన్), తంజీద్ హసన్, లిటన్ దాస్ (వికెట్ కీపర్), షకీబ్ అల్ హసన్, తౌహీద్ హృదయ్, మహ్మదుల్లా, సౌమ్య సర్కార్, రిషద్ హొస్సేన్, తస్కిన్ అహ్మద్, తంజీమ్ హసన్ షకీబ్, ముస్తాఫిజుర్ రహ్మాన్.






**సెమీ ఫైనల్-1**
సౌతాఫ్రికా vs ఆఫ్ఘానిస్తాన్
రేపు 8.30 రాత్రి



**సెమీ ఫైనల్-2**
ఇండియా vs ఇంగ్లండ్
ఎల్లుండి 10.30 ఉదయం

సెమీస్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఢీ
టీ20 వరల్డ్ కప్ సూపర్-8లో ఆస్ట్రేలియాపై విజయంతో టీమ్ఇండియా సెమీఫైనల్‌కు చేరుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్‌తో సెమీస్‌లో తలపడనుంది. ఈ మ్యాచ్ ఎల్లుండి (జూన్ 27న) గయానాలో రా. 8 గంటలకు ప్రారంభం కానుంది. కాగా 2022 టీ20 వరల్డ్ కప్ సెమీస్‌లో ఇంగ్లండ్ చేతిలో రోహిత్ సేన చిత్తుగా ఓడిన సంగతి తెలిసిందే. తొలుత భారత్ 168 రన్స్ చేయగా, వికెట్లేమీ కోల్పోకుండా ఇంగ్లండ్ ఓపెనర్లే లక్ష్యాన్ని ఛేదించారు.



## కేరళ పేరును 'కేరళం'గా మార్చాలని తీర్మానం

కేరళ పేరును 'కేరళం'గా మార్చాలని కోరుతూ ఆ రాష్ట్ర శాసనసభ మరోసారి ఏకగ్రీవ తీర్మానం చేసింది. సీఎం పినరయి విజయన్ నిన్న సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అన్ని పార్టీలు దీనిని ఏకగ్రీవంగా ఆమోదించాయి. విపక్షాలు పలు సవరణలు సూచించాయి. కాగా గత ఏడాది కూడా కేరళ ప్రభుత్వం దీనిపై ఏకగ్రీవ తీర్మానం చేసింది. కానీ ఆ విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది.



## నేషనల్ క్రికెట్ అకాడమీకి వీవీఎస్ లక్ష్మణ్ గుడ్ బై?

నేషనల్ క్రికెట్ అకాడమీ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ తన పదవి నుంచి తప్పుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాదితో లక్ష్మణ్ పదవీకాలం ముగియనుంది. మరోసారి ఆయన ఈ పదవి చేపట్టేందుకు ఆసక్తి కనబరచటం లేదని టాక్. ఎన్సీఏ హెడ్ నుంచి తప్పుకున్న తర్వాత కామెంటరీతోపాటు ఐపీఎల్ మెంటార్‌గా ఆయన రీఎంట్రీ ఇవ్వనున్నట్లు సమాచారం. కాగా 2021లో సౌరవ్ గంగూలీ బీసీసీఐ బాస్‌గా ఉన్న సమయంలో లక్ష్మణ్ ఎన్సీఏ హెడ్‌గా బాధ్యతలు చేపట్టారు.



## బాలికపై కిరాతకంగా గ్యాంగ్ రేప్..

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన హైదరాబాద్ - నేరెడ్‌మెట్‌లో కాచిగూడకు చెందిన బాలికకు(15) గంజాయి తాగించి మత్తులోకి వెళ్లిన తర్వాత అత్యాచారం చేసిన అయిదుగురు యువకులు. సంఘటన జరిగిన కొద్దిరోజులకు గర్భం దాల్చడంతో తన తల్లికి విషయం చెప్పిన బాలిక.. పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి. కేసు నమోదు చేసి నిందితులకోసం గాలిస్తున్న పోలీసులు.



## చికెన్ లెగ్ పీస్ కోసం పెళ్లిలో గొడవ

యూపీలోని బరేలీలో ఇటీవల ఓ పెళ్లిలో గొడవ జరిగింది. విందు సమయంలో ఓ వ్యక్తికి బిర్యానీలో చికెన్ లెగ్ పీస్ రాలేదు. దీంతో ఆ వ్యక్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. కాసేపటికి గొడవ పెద్దదై, వధువు-వరుడి కుటుంబ సభ్యుల మధ్య వివాదం మొదలైంది. ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నారు. కుర్చీలు విసురుకుని, ఒకరినొకరు గాయపర్చుకున్నారు. ఈ గందరగోళం మధ్య పెళ్లికి వరుడు నిరాకరించాడు. పెద్దలు సర్ది చెప్పడంతో వివాహం జరిగింది.



## టీవీ షోలో కోట్ విప్పేసిన అనసూయ

అనసూయ భరద్వాజ్ పెద్దగా పరిచయం అక్కర్లేదు. బుల్లి తెరపై యాంకర్‌గా ఎంట్రీ ఇచ్చి ప్రస్తుతం సినిమాలు చేస్తూ వస్తున్నది. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ పలు అంశాలపై ముక్కుసూటిగా స్పందిస్తుంది. అలాగే తన సినిమాలకు సంబంధించి అప్‌డేట్స్‌తో పాటు ఫొటోషూట్లకు సంబంధించిన పిక్స్‌ను సైతం అభిమానులతో పంచుకుంటుంది. స్టార్ మాలో కిరాక్ బాయ్స్.. ఖిలాడీ గర్ల్స్ షోలో ఇద్దరూ సందడి చేశారు. ఈ షోలో ఓ ఛాలెంజింగ్‌లో భాగంగా కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్‌తో కలిసి అనసూయ తన కోట్ తీసివేయగా.. ఓ ప్రముఖ కొరియోగ్రాఫర్ చొక్కా విప్పడం కనిపించింది. దీన్ని చూసిన పలువురు అనసూయపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఓ నెటిజన్ చేసిన కామెంట్‌కు అనసూయ స్పందించింది. 'కాలం మారుతోంది. ఆడియెన్స్ టేస్ట్ మారుతోంది. మేం వినోదరంగంలో ఉన్నప్పుడు వాటికి తగ్గట్లుగానే చేయాల్సి ఉంటుంది.



## దేశ చరిత్రలోనే తొలిసారి
# లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక!

లోక్‌సభ స్పీకర్ ఎన్నికలో ట్విస్ట్ చోటుచేసుకుంది. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఆ పోస్టుకు ఎన్నిక జరగబోతోంది. ఇన్నేళ్లలో ఏకగ్రీవంగానే లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరుగుతూ వచ్చింది. అయితే 18వ లోక్‌సభ స్పీకర్ పదవి కోసం అధికార-ప్రతిపక్షాల మధ్య ఏకాభిప్రాయం కోసం జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. దీంతో.. ఇటు ఎన్డీయే కూటమి, అటు ఇండియా కూటమి అభ్యర్థుల్ని బరిలో నిలిపాయి. ఎన్డీయే కూటమి తరఫున ఓం బిర్లా, ఇండియా కూటమి తరపున సీనియర్ ఎంపీ కే.సురేష్ నామినేషన్ వేశారు. లోక్‌సభలో ఎన్డీయే కూటమికి 294 మంది ఎంపీల బలం ఉంది. అయినప్పటికీ తొలిసారి జరుగుతుండడంతో ఈ ఎన్నికపై ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉంటే.. మరోసారి లోక్‌సభ స్పీకర్ అభ్యర్థిగా ఓం బిర్లానే ఎన్డీయే కూటమి ఎంచుకుంది. స్పీకర్ పోస్టుకు ఆయన నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు.. ఓం బిర్లాను లోక్‌సభ స్పీకర్‌గా కొనసాగిస్తారని ప్రచారం నడిచిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ఇవాళ ఉదయం ఓం బిర్లా.. ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. అదే సమయంలో.. ఓం బిర్లా ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు ఎన్డీయే తీవ్రంగా యత్నించింది. బీజేపీ అగ్రనేత రాజ్‌నాథ్ సింగ్.. ఇండియా కూటమి నేతలతో చర్చలు జరిపారు. అయితే ఆనవాయితీగా వస్తున్న డిప్యూటీ స్పీకర్ పోస్టును ప్రతిపక్షాలకు వదిలేయాలని కాంగ్రెస్ చీఫ్ ఖర్గేతో పాటు ఇండియా కూటమి నేతలంతా ప్రతిపాదించారు. దీంతో.. మరోసారి ఫోన్ చేసి పిలుస్తామంటూ రాజ్‌నాథ్‌సింగ్ వాళ్లకు చెప్పారు. అయితే డిప్యూటీ స్పీకర్ విషయంలో అధికార కూటమి తటపటాయించింది. ఈ క్రమంలో మరోసారి ఎన్డీయే నుంచి పిలుపు రాకపోవడంతో.. అభ్యర్థినే నిలపాలని ఇండియా కూటమి నిర్ణయించింది. దీంతో దేశచరిత్రలోనే.. రేపు(జూన్ 26, 2024) తొలిసారి లోక్‌సభ స్పీకర్



పదవికి ఎన్నిక జరగబోతోంది.ఇంతకు ముందు ప్రొటెం స్పీకర్ విషయంలోనూ కే.సురేష్ పేరు తెర మీదకు వచ్చిన సంగతి తెలిసిందే. కేరళ కాంగ్రెస్ సీనియర్ నేత అయిన సురేష్.. ఎనిమిదిసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. నిన్న 280 మంది ఎంపీలు లోక్‌సభలో ప్రమాణం చేయగా.. ఇవాళ మిగతా వాళ్లు చేస్తున్నారు. ఇక రేపు(జూన్ 25) స్పీకర్ ఎన్నిక జరగనుంది. ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ సమక్షంలో స్పీకర్ ఎన్నిక జరగనుంది.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## మంత్రివర్గంలోకి పోచారం శ్రీనివాస్?

రాష్ట్ర కేబినెట్‌లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఆయనకు మంత్రి పదవి ఇచ్చేందుకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఎవరూ మంత్రివర్గంలో లేకపోవడంతో ఆయనను తీసుకుంటున్నట్లు టాక్. కాగా నిన్న ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్, వేణుగోపాల్‌తో పోచారం భేటీ అయిన సంగతి తెలిసిందే.



## భారీగా పెరిగిన హైదరాబాద్ మెట్రో ఆదాయం

హైదరాబాద్ మెట్రో ఆదాయం గత ఆర్థిక సంవత్సరంలో 105% పెరిగినట్లు L&T సంస్థ తన నివేదికలో వెల్లడించింది. 2022-23లో రూ.703.20 కోట్ల ఆదాయం రాగా, 2023-24లో రూ.1407.81 కోట్లకు పెరిగిందని పేర్కొంది. దీంతో గత ఏడాది నష్టాలు భారీగా తగ్గాయని తెలిపింది. 2022-23లో రూ.1315.99 కోట్లుగా ఉన్న నష్టాలు, 2023-24లో రూ.555.04కోట్లకు తగ్గాయి. మెట్రో ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఆరేళ్లలో నష్టాలు రూ.5979.36 కోట్లకు చేరాయి.



## కొద్ది సేపట్లో పెళ్లి.. వధువును చంపిన ప్రియుడు

యూపీలోని ఝాన్సీలో ఆదివారం షాకింగ్ ఘటన జరిగింది. మధ్యప్రదేశ్ దతియా జిల్లా సోనగిరి ప్రాంతానికి చెందిన కాజల్(22) వివాహం ఝాన్సీకి చెందిన రాజ్ యువకుడితో జరగాల్సి ఉంది. పెళ్లికి ముందు వధువు సమీపంలోని బ్యూటీ సెలూన్‌కు వెళ్లింది. మేకప్ చివరి దశలో ఉండగా ఆమె మాజీ ప్రియుడు ధనిరామ్ అక్కడికి వచ్చాడు. తనతో రావడానికి నిరాకరించిందనే కోపంతో తుపాకీతో కాల్చి చంపాడు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.




## ఏఐ టెక్నాలజీతో సిద్ధమవుతోన్న యూపీఎస్సీ

పరీక్షల ప్రక్రియను పటిష్ఠపర్చేలా ఫేషియల్ రికగ్నైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత CCTVలతో పర్యవేక్షణ వ్యవస్థను UPSC రూపొందించుకోనుంది. పరీక్షా కేంద్రాల్లో కెమెరాలు ఆఫ్‌లైన్‌కి వెళ్లినా, అనుమానాస్పద కదలికలున్నా, సమయం దాటి ఇన్విజిలేటర్ అక్కడే ఉన్నా ఈ సిస్టమ్ అధికారుల్ని అలర్ట్ చేస్తుంది. సివిల్ సర్వీసెస్ IFSలతో సహా 14కీలక పరీక్షల్ని UPSC నిర్వహిస్తోంది. ఏటా దాదాపు 26లక్షల మంది పోటీ పడుతుంటారు.

## ఆస్పత్రి పాలైన బ్రిటన్ యువరాణి

బ్రిటన్ యువరాణి, కింగ్ ఛార్లెస్-3 సోదరి అనే (73) తలకు బలమైన గాయం తగిలి ఆస్పత్రి పాలయ్యారు. ఈ మేరకు బకింగ్‌హామ్ ప్యాలెస్ ఓ ప్రకటనలో తెలిపింది. త్వరలోనే ఆమె పూర్తిగా కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేసింది. బ్రిస్టల్‌లోని గాట్‌కాంబ్ పార్క్ ఎస్టేట్‌లో ఓ గుర్రం కారణంగా ఆమె తలకు దెబ్బ తగిలినట్లుగా భావిస్తున్నారు. దీంతో వెంటనే ఆమెను స్థానిక సౌత్‌మేడ్ ఆస్పత్రిలో చేర్చారు.

# జీవన్ రెడ్డి దారెటు?



తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రెండు రోజుల వ్యవధిలో బీఆర్ఎస్ కు చెందిన ఇద్దరు నమ్మిన బంట్లు కాంగ్రెస్ పార్టీలో చేరడం ఇప్పుడు రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి.. సీఎం రేవంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీనిపై బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున తమనిరసనలు తెలిపారు. బీఆర్ఎస్ లో అధికారం, హోదాలను అనుభవించి పార్టీ కష్టకాలంలో ఇలా మారడం పట్ల ఆయన్నుచాలా మంది తీవ్రంగా విమర్శించారు. మరోవైపు కేవలం రైతుల మంచి కోసమే.. తాను పార్టీ మారానని, సీఎం రేవంత్ పాలన పట్ల ఆకర్శితుడయ్యానని చెప్పుకొచ్చారు. తనకు పదవుల మీద ఆసక్తిలేదంటూ వ్యాఖ్యలుచేశారు. ఈ క్రమంలోనే జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కూడా గులాబీ బాస్ కు షాక్ ఇచ్చారు. ఎవరు కూడా ఊహించని విధంగా సీఎం రేవంత్ ను జూబ్లిహిల్స్ లో కలిసి కాంగ్రెస్ కండువ కప్పుకున్నారు. ఈ వరుస పరిణామలతో బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరిగా మారిందని చెప్పుకోవచ్చు. మరోవైపు ఇటీవల కాంగ్రెస్ లో చేరిన పోచారం, సంజయ్ కుమార్ ల చేరికలపై , కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్రంగా పరిగణించారు. తన జిల్లా నుంచి ఇద్దరు నేతలు పార్టీలో చేరిన తనకు కనీసం సమాచారం లేదని తీవ్ర మనస్తపానికి గురైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే పోచారం పార్టీలో చేరినప్పుడు.. ఇలాంటి రాజకీయాలు చేయొద్దని, మనకు కావాల్సిన మెజారిటీ ఉందని ఇండైరెక్ట్ గా రేవంత్ కు సూచించారు. ఇప్పుడిక.. సంజయ్ కుమార్ చేరడంతో ఆయన అగ్గిమీద గుగ్గిలమయ్యారు. తన ఫోన్ లను స్విచ్ ఆఫ్ చేసుకుని ఎమ్మెల్సీ పదవీకి రాజీనామా చేస్తానంటూ కూడా అన్నట్లు తెలుస్తోంది. జగిత్యాల.. సంజయ్‌ను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడాన్ని నిరసిస్తూ.. జగిత్యాల కిసాన్ సెల్ కాంగ్రెస్ పార్టీ కో అర్డీనేటర్ పదవికి వాకిటి సత్యం రెడ్డి రాజీనామా చేశారు. ఈ పరిణామల నేపథ్యంలో.. జీవన్ రెడ్డి ఇంటికి కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. జగిత్యాల నియోజక వర్గంలో.. 2014 నుంచి మూడు పర్యాయాలు సంజయ్ లు, జీవన్ రెడ్డిలు ప్రత్యర్థులుగా ఎన్నికల బరిలో తలపడ్డారు.ఈ నేపథ్యంలో తనకు ఒక్కమాట కూడా చెప్పకుండా.. సంజయ్ ను జాయిన్ చేసుకోవడం పట్ల జీవన్ రెడ్డి తీవ్ర మనస్తాపంతో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు జీవన్ ను బుజ్జగించేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లు ఆయన ఇంటికి వెళ్లారు. ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పినట్లు తెలుస్తోంది. నలభై ఏళ్లుగా హుందాగా రాజకీయాలు చేశానని, ఇలాంటి పనుల వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తుందని వాపోయినట్లు తెలుస్తోంది. పార్టీకీ రాజీనామా చేసి వ్యవసాయ పనులు చేయడానికి సైతం తాను సిద్ధమే అంటూ తన సన్నిహితులతో జీవన్ రెడ్డి అన్నట్లు తెలుస్తోంది.

**రంగంలోకి బండి, ఈటల..?**

సీఎం రేవంత్ రెడ్డి దుందుడుకు చర్యల పట్ల కాంగ్రెస్ లోని అనేక మంది సీనియర్లు అంతా గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.ఇక ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బహిరంగానే రేవంత్ తీరును తప్పుపట్టారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని రాజకీయాలు శరవేగంగా మారిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి.. బీజేపీ కీలకనేతలు టచ్ లో ఉన్నట్లు వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లుకొడుతున్నాయి. మెయిన్ గా కేంద్ర మంత్రి బండి సంజయ్, ఈటల రాజేందర్ లు రంగంలోకి దిగి, జీవన్ రెడ్డితో మంతనాలు నడిపిస్తున్నట్లు సమాచారం.ఈ క్రమంలో ఇప్పుడు తెలంగాణలో ప్రధాన అపోసిషన్ గా బీజేపీ ఎదుగుతుంది. ఇప్పటికే బీజేపీకి 8 ఎమ్మెల్యేలు, 8 ఎంపీ స్థానాలు ఉన్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్ గా ఇప్పటి నుంచి బీజేపీ పావులు కదుపుతున్నట్లు సమాచారం. సీఎం రేవంత్ పై.. మనస్తాపంగా ఉన్న జీవన్ రెడ్డి, బీజేపీలో చేరితే.. తమకు మరింత బలంచేకూరుతుందని ఆపార్టీ అభిప్రాయపడుతున్నట్లు వార్తలు జోరుగా ప్రచారం జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్సీ జీవర్ రెడ్డి కాంగ్రెస్ లోనే ఉంటారా..? .. లేదా బీజేపీ కండువ కప్పుకుంటారా.. అనే విషయంలో మాత్రం ప్రస్తుతం సస్పెన్స్ కొనసాగుతుంది.

# బికినీలో హాట్‌గా షాలినీ



తాజాగా అందాల గేట్లు తెరిచేసి ఫోటో షూట్ వదిలింది షాలినీ పాండే. బికినీ వేర్‌లో కెమెరా ముందు పిచ్చెక్కించే పోజులిచ్చింది. దీంతో ఈ ఫొటోస్ వైరల్ అవుతున్నాయి.తమ పాపులారిటీ కోసం నేటితరం హీరోయిన్లు శృతి మించిన అందాల విందు చేస్తున్నారు. సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తూ ఫాలోయింగ్ పెంచుకుంటున్నారు. ఇదే బాటలో వెళుతూ తన గ్లామర్ తో ఆన్ లైన్ మాధ్యమాలను షేక్ చేస్తోంది షాలినీ పాండే.ఈ క్రమంలోనే తాజాగా అందాల గేట్లు తెరిచేసి ఫోటో షూట్ వదిలింది షాలినీ పాండే. బికినీ వేర్‌లో కెమెరా ముందు పిచ్చెక్కించే పోజులిచ్చింది. సొగసుల గాలం వేస్తూ కుర్రకారులో వేడి పుట్టించింది. దీంతో ఈ పిక్స్ నెట్టింట వైరల్ గా మారాయి.అర్జున్ రెడ్డి సినిమాతో ఓవర్ నైట్ క్రేజ్ కొట్టేసిన షాలినీ పాండే.. తొలి సినిమాతోనే యువత పల్స్ పట్టేసింది. దీంతో ఈ అమ్మడికి నేమ్ ఫేమ్ రెండూ దక్కాయి.




## వైజాగ్ కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డికి టీమిండియాలో చోటు

### జింబాబ్వే టూర్‌కు కెప్టెన్‌గా గిల్

టి20 ప్రపంచకప్ ముగిసిన వెంటనే జింబాబ్వేలో పర్యటించే భారత జట్టును సోమవారం బీసీసీఐ ప్రకటించింది. ఈ జట్టులో తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డితో పాటు అభిషేక్ శర్మ, తుషార్ దేశ్‌పాండే, రియాన్ పరాగ్‌లకు చోటు దక్కింది. వీరంతా తొలిసారి భారత జట్టుకు ఎంపికయ్యారు. ఈ యువ ఆటగాళ్లు ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో మంచి ప్రదర్శన కనబరిచారు. రుతురాజ్ గైక్వాడ్, రింకూ సింగ్ తిరిగి జట్టులోకి వచ్చారు. టి20 వరల్డ్ కప్‌లో ఆడిన సీనియర్లందరికీ విశ్రాంతి ఇచ్చారు. భారత్, జింబాబ్వే జట్ల మధ్య 5 మ్యాచ్‌ల టి20 సిరీస్ జరుగనుంది. జింబాబ్వే వేదికగా జులై 6 నుంచి 14 వరకు ఈ సిరీస్ జరుగుతుంది.

**ఎవరీ నితీష్ కుమార్ రెడ్డి?**

2023 సీజన్‌తో నితీష్ కుమార్ ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. ఇప్పుడు నితీష్ వయస్సు 21 ఏళ్లు. 2003 మే 26న ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నితీశ్ జన్మించాడు. 2024 ఐపీఎల్ సీజన్‌లో 13 మ్యాచ్‌లాడిన నితీశ్ 142 స్ట్రయిక్‌రేట్‌తో 303 పరుగులు చేశాడు. 3 వికెట్లు తీశాడు. దీనికంటే ముందు ఈ ఏడాది జనవరిలో రంజీ ట్రోఫీలో భాగంగా ముంబయితో జరిగిన మ్యాచ్‌లో నితీష్ కుమార్ అద్భుతంగా బౌలింగ్ చేసి ఐదు వికెట్లు తీశాడు. ఇందులో అజింక్య రహానే, శ్రేయస్ అయ్యర్ వికెట్లు కూడా ఉన్నాయి. విరాట్ కోహ్లీని అభిమానించే నితీష్ కుమార్‌కు తానో విలువైన ఆటగాడిగా నిరూపించుకునే ప్రతిభ ఉందని సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ విమల్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం హార్దిక్ పాండ్యాలా ఫాస్ట్ బౌలింగ్ కోటాలో ఆల్‌రౌండర్‌గా పరిగణించాల్సిన కొద్ది మంది ఆటగాళ్లలో నితీష్ కుమార్ రెడ్డి కూడా ఒకరని విమల్ అభిప్రాయపడ్డారు. నిరుడు క్రికెట్ దిగ్గజాలు బ్రయాన్ లారా, డేల్ స్టెయిన్‌తో నితీష్ కుమార్ ఎక్కువ సమయం గడిపాడు. నితీష్ కుమార్ గురించి మరో తెలుగు క్రికెటర్ హనుమ విహారి ఐపీఎల్ సమయంలో మాట్లాడుతూ, నితీష్ అరుదైన ఆటగాడని, అతనిపై బీసీసీఐ దృష్టిసారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు నితీష్ భారత జట్టుకు ఎంపికయ్యాడు.

**భారత జట్టు:**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), నితీశ్ రెడ్డి, యశస్వీ జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, రింకూ సింగ్, సంజూ శాంసన్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముఖేష్ కుమార్, తుషార్ దేశ్‌పాండే